క్లుప్తంగా

రూ.83 లక్షలతో చౌదంతివలస బీటీరోడ్డు పనులు



చౌదంతివలస తారురోడ్డు పునరుద్ధరణ పనులు

దత్తిరాజేరు: ఏఎంసీ నిధులు రూ.83 లక్షలతో జాతీయ రహదారి 26 నుంచి చౌదంతివలస కూడలి మీదుగా దత్తిరాజేరు గ్రామానికి రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు డీఈఈ అప్పలనాయుడు బుధవారం తెలిపారు. చౌదంతివలస కూడలి నుంచి గ్రామానికి 1.5 కిలోమీటర్లు మేర తారురోడ్డు పనులను వారం రోజుల్లో పూర్తిచేయనున్నట్లు చెప్పారు. రోడ్డు శిథిలం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేశారు. ఎంపీపీ జి.సింహాద్రినాయుడు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జోరందుకున్న అభివృద్ధి పనులు

చీపురుపల్లి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి హడ్కోకాలనీలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. కాలనీలోని ప్రధాన వీధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.10 లక్షలతో ఇప్పటికే సిమ్మెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

బైక్‌ను ఢీకొన్న లారీ

• వ్యక్తికి తీవ్రగాయాలు

జామి: లారీ, బైక్‌ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు అలమండ గ్రామానికి చెందిన అయినంపూడి సత్యనారాయణరాజు కంటకాపల్లి నుంచి బుధవారం బైక్‌పై అలమండ వస్తున్న సమయంలో విజయనగరం నుంచి వస్తున్న లారీ అలమండ పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రహదారిపై బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరాజును స్థానికులు 108 అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తెలిసింది.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

• ఎస్సై సీహెచ్ హేమంత్‌కుమార్



విద్యార్థులతో ఎస్సై హేమంత్‌కుమార్

కొత్తవలస: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎస్సై సీహెచ్ హేమంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిషా, డీన్ సంతోష్‌కుమార్, జీఎం రమ్య తదితరులు పాల్గొన్నారు.

డోలపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

గజపతినగరం రూరల్: మండలంలోని డోలపాలెం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో సుమారు 76 మందికి వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

విధుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

• ఉపాధి ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు

మెరకముడిదాం: విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి చెందిన ఉపాధి సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనదారులకు పనిదినాలను కల్పించాలని, కొలతలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులను మాత్రమే పనులకు అనుమతించాలని, పనికి హాజరైన వారికి మాత్రమే మస్తర్లు నమోదు చేయాలన్నారు. తప్పుడు మస్తర్లు నమోదు చేసినా, అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గృహ నిర్మాణాలకు సంబంధించి 90 పనిదినాలకు బిల్లులు చెల్లింపు చేయాలని, ఉద్యానవన మొక్కలు నాటే కార్యక్రమాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ పనులను గుర్తించి అంచనాలను తయారుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎ.నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



జామి: అలమండలో జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గొర్లె సరయు



వేపాడ: సోంపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు

వేపాడ: సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సోంపురం, కుమ్మపల్లి గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పట్నాయక్ నేతృత్వంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజుతో కలిసి ఆయన పాల్గొని పలువురు అర్జీదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ కస్తూరీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, సర్పంచ్ గంగరాజు, నౌడు అరుణ, ఎంపీటీసీ సత్యనారాయణ, బాలబాబు తదితరులు పాల్గొన్నారు.

జామి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ గొర్లె సరయు, ఎంపీపీ సబ్బవరపు అరుణ అన్నారు. మండలంలోని అలమండ-1,2 సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వారు పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉప సర్పంచ్ లగుడు దేముడు, ఎంపీడీఓ సతీష్, డీటీ సునీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 52 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు

• వ్యవసాయశాఖ జేడీఏ వీటీ రామారావు



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీఏ వి.టి.రామరావు

బొండపల్లి: జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో 52 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వి.టి.రామరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న 30 మంది ఎస్సీ రైతులకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.10 వేలు విలువ చేసే ఇన్‌పుట్స్‌తో పాటు పీఎండీఎస్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 236 మంది రైతులను గుర్తించామని, వారందరికీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పీఎండీఎస్ కిట్లుతో పాటు వివిధ రకాల సాగు పనిముట్లు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఈ విషయాన్ని గమనించి ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసేందుకు ముందుకురావాలని కోరారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాల కొరత లేకుండా ఆర్‌బీకేల ద్వారా పూర్తిస్థాయిలో విత్తనాలు అందించామన్నారు. ఎరువులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.సుధారాణి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు, గజపతినగరం సబ్‌డివిజన్ ఏడీఏ కె.మహారాజన్, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస: వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తవలస మండలం అప్పన్నపాలెం, వేపాడ మండలం బానాది-2, ఆకులసీతంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి ఆర్.ఉమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కొత్తవలస మండలం గిడిజాల రోడ్డులో కుమ్మరిబంజిరి వద్ద ఉన్న ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గుర్ల: మండలంలోని రాగోలులో రూ.55 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులకు జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు, ఎంపీటీసీ గిడిజాల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్స్‌బుక్స్ వితరణ

వేపాడ: మండలంలో వావిలపాడు పంచాయతీ కడకొండ, వీలుపర్తి పంచాయతీ చినదుంగాడ గ్రామాల్లో గిరిజన విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఎ.కోడూరు, పాడుగుపాలెంకు చెందిన దొగ్గ మల్లమ్మ సర్వీస్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం పలకలు, పెన్సిళ్లు, పెన్నులు వితరణ చేశారు. సంస్థ ద్వారా ఏటా పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పైపులు, తొట్టెల పంపిణీ

దత్తిరాజేరు: వాటర్ షెడ్ పథకం ద్వారా మండలంలోని మరడాం గ్రామంలో 20 మంది కూరగాయ రైతులకు సాగునీటి పైపులు, కూరగాయల రవాణాకు ప్లాసిక్ తొట్టెలు పంపిణీ చేసినట్లు పీఓ వసంత బుధవారం తెలిపారు. ప్రధానమంత్రి కృషి సంచాయిత యోజన ద్వారా రైతులకు పనిముట్లు, టార్పాలిన్లు అందజేయనున్నట్లు చెప్పారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధశాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను, గత సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఖరీఫ్‌లో రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు అందించామని, ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచామని ఏఓ అనురాధ అన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కె.కొత్తవలస వైద్యాధికారి సంతోషరూప తెలిపారు. పెండింగ్ బిల్లులపై మాట్లాడుదామంటే ఇరిగేషన్ జేఈ ఎప్పుడూ అందుబాటులో ఉండటం లేదని పలువురు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. దాసుపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహణ బాగోలేదని, సరుకులు ఎక్కడ ఉంటున్నాయో తెలియని పరిస్థితి ఉందని సర్పంచ్ ప్రతినిధి శంకరరావు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. రెవెన్యూ కార్యాలయంలో భూములకు సంబంధించిన డిజిటల్ సిగ్నేచర్ ఎప్పటికప్పుడు మార్పుచేయడంపై అన్ని గ్రామాల సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓ, హెచ్‌ఎంకు సన్మానం




ఎంఈఓ బూసినాయుడును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గజపతినగరం: మండలంలో పురిటిపెంట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన ఎం.బూసినాయుడుకు చీపురుపల్లి ఎంఈఓగా పదోన్నతి లభించడంతో కొత్త హెచ్‌ఎంగా గుర్ల మండలానికి చెందిన చిప్పాడ రమేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ బూసినాయుడు, హెచ్‌ఎం రమేష్‌కుమార్‌లను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని కోరారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీనివాసరావుతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

డీఈఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

గంట్యాడ: విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నరవ గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌ను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

దశపత్ర కషాయంతో తెగుళ్ల నివారణ

వేపాడ: దశపత్ర కషాయంతో వరి పంటను ఆశించే తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ గోకేడ శ్రీను అన్నారు. మండలంలోని వీలుపర్తిలో రైతులకు దశపత్ర కషాయం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. 200 గ్రాముల పసుపు, కిలో చొప్పున అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, 2 కిలోల పొగాకు కాడలు, బంతి ఆకులు 2 కిలోలు, వేప, కాగు, సీతాఫలం, నేపాలం, జిల్లేడు, బొప్పాయి, ఆముదం, ముషిడి ఆకులు, నేలంఆకు, కుంకుడు ఆకులు, కసివింద ఆకులు తదితర 10 రకాలు ఆకులతో దీన్ని తయారు చేస్తారు. ఈ కషాయం ఆరు నెలలు పాటు నిల్వ చేసుకోవచ్చన్నారు.

20 ఎకరాల్లో మామిడి మొక్కల పెంపకం

గజపతినగరం రూరల్: ఉపాధిహామీ పథకం నిధులతో మండలంలో 20 ఎకరాల్లో వెయ్యి మామిడి మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఏపీఓ చప్ప రామారావు తెలిపారు. మండలంలోని దావాలపేట గ్రామంలో ఇప్పటికే నాటిన మొక్కలను బుధవారం ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గజపతినగరం: కంపెనీల్లో, షాపింగ్ మాల్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించే ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వీ రవిప్రసాద్ ఆధ్వర్యంలో మెంటాడ జంక్షన్‌లో ఉన్న ఆర్‌కే ఫ్యామిలీ మార్ట్‌లో అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ బుధవారం నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-విజయనగరం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస మిశ్రాకు అఖిలపక్ష నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు తెలుగుదేశం, బీజేపీ, సీపీఐ నాయకులు కోళ్ల లలితకుమారి, డేగల అప్పలరాజు, మాన్యం దేముడు తదితరులు పార్టీ కార్యకర్తలతో కలిసి కొత్తవలస జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియజేశారు.

నేడు ఉత్తరాపల్లిలో ఆర్‌బీకే ప్రారంభం

కొత్తవలస: మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులమీదుగా గురువారం మధ్యాహ్నం ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మలపాలెంలో ఎంపీడీఓ వై.పద్మజ ఆధ్వర్యంలో, ఉత్తరాపల్లిలో తహసీల్దార్ శ్రీనివాస మిశ్రా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే లక్కవరపుకోట మండలం లచ్చింపేటలో ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు, చందులూరులో తహసీల్దార్ జి.ఆదిబాబు ఆధ్వర్యం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు.

శిథిల భవనం తొలగింపు

గజపతినగరం: పురిటిపెంటలోని మామిడి బంద కాలనీలో శిథిలమైన అటవీశాఖ భవనాన్ని తొలగించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. భవనం పూర్తిగా శిథిలమవడంతో అందులో విషసర్పాలు, పందులు, కుక్కలు సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి, మండల సురేష్‌కు వెంటనే స్పందించి జేసీబీ సాయంతో భవనాన్ని తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తరించాలి

• ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



నూతన అధ్యక్షులను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని బీఎస్ లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రాత్రి లైయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ చంద్రశేఖర్ లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌ల సేవలను కొనియాడుతూ.. క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషిచేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో అదనపు భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

లయన్స్ క్లబ్, స్టార్స్ లయన్స్ క్లబ్‌లకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టార్స్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీజీ శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.కిరణ్, కోశాధికారిగా ఒమ్మి రమేష్, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌వీ దుర్గారావు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కె.నాగశంకర్‌లను ఎన్నుకున్నారు. వారితో లైయన్స్ క్లబ్ మాజీ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ, ఫేకర్ సీఈ ఎంఎస్‌ఎస్ శర్మ ప్రమాణం చేయించారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో లైయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, బెల్లాన వంశీకృష్ణ, ఎస్.రాధాకృష్ణ, కందుల పుండరీ పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకొచ్చి న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నివారించాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. అవనిగడ్డ కోర్టులో న్యాయవాది శ్రీనివాసరావుపై జరిగిన దాడిని ఖండిస్తూ విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎస్.శర్మ మాట్లాడుతూ.. అవనిగడ్డ బార్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, టి.వి.ఆర్.మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, ఎం.అనూరాధ, ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సోంపురంలో ఆర్‌బీకే ప్రారంభం



సోంపురం ఆర్‌బీకేని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ: అన్నదాతకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. మండలంలోని సోంపురంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ గంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రపరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఆర్‌బీకే ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రం పనితీరును ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వీఏఏ వెంకటేష్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ కస్తూరీ, సర్పంచ్ గంగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఎంపీటీసీ సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటరావు, జేసీఎస్ బోజంకి శ్రీను, యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం

మెరకముడిదాం: ఉద్యానవన పంటల సాగు రైతులకు లాభదాయకమని ఉపాధి ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఊటపల్లి, పులిగుమ్మి గ్రామాల్లో ఉపాధి నిధులతో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను ఈసీ ఎ.నరేంద్రకుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ రెండు గ్రామాల్లో రూ.14.56 లక్షలతో 14 ఎకరాల్లో కొబ్బరి, జీడి, మామిడి మొక్కలను రైతులు సాగుచేస్తున్నారు. నాటిన ప్రతీ మొక్కను సరంక్షించాలని, వారానికి ఒకసారి నీటితడులు అందించాలని సూచించారు. మొక్కల సంరక్షణకు గాను ప్రతీ నెల ఒక్కో మొక్కకు రూ.31 చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ నిధులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుర్ల: మండలంలోని జమ్ములో మద్యం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబునాయుడు తెలిపారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహించే వారిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.